సాక్షి ఆదిలాబాద్

గురువారం : 2 : నవంబర్ : 2023



తస్మాత్ జాగ్రత్త.. 10లో▸

రేపటి నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సరిగా పూరించకుంటే తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

సమస్యల్లో కుండిశేకుగూడ



గాదిగూడ మండలంలోని కుండిశేకుగూడ గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం 31.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి వేళలో చలి ప్రభావం కనిపిస్తుంది. తేమశాతం పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్వో చాహత్ బాజ్‌పాయ్

బోథ్: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆమె సమావేశం అయ్యారు. ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో ఆయా పార్టీల నాయకులకు పలు సూచనలు చేశారు. ర్యాలీలకు రెండు రోజుల ముందు అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సూర్యం, రవి, అబూద్, షేక్ నాజర్ అహ్మద్, షేక్ షాకీర్, నరేశ్, పంచాక్షరి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న మోహన్

ఎదులాపురం: మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని వినియోగదారుల ఫోరం జిల్లా చైర్మన్ మోహన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. వినియోగదారుల పరిధిలోకి వచ్చే మార్కెట్ యార్డులో పత్తి రైతులకు తాగునీటి సౌకర్యం, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఫోరం బాధ్యులు పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని భీంజీగూడలో ఇటీవల చోటు చేసుకున్న గిరిజన విద్యార్థిని హత్య దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని ఎస్పీ బుధవారం పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో చర్చించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని భరోసానిచ్చారు. హత్యకు గల కారణాలు, అనుమానితులు ఎవరైనా ఉంటే వివరాలు వెల్లడించి దర్యాప్తునకు సహకరించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఆదిలాబాద్‌రూరల్ సీఐ సైదారావు, నార్నూర్ సీఐ ప్రేంకుమార్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఆదిలాబాద్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ సమక్షంలో కేఆర్‌కే కాలనీకి చెందిన పలువురు బుధవారం కమలం పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ సంతోశ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు రాజు, మహిళా నాయకురాలు గంగుబాయితో పాటు పలువురు కమలం తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు లాలామున్నా, రఘుపతి, శరత్, ఆదినాథ్, దినేశ్ మహోలియా, సంతోశ్, విజయ్, మయూర్ చంద్ర పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పోరాడాలి



మాట్లాడుతున్న దేవేందర్

ఎదులాపురం: హక్కుల సాధన కోసం కార్మికులు పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్మిక అడ్డాల వద్ద ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు, పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి ఎస్‌కే నూర్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ పరిశీలన (ఫైల్)



సర్వం సిద్ధం

- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- రేపు నోటిఫికేషన్ జారీ
- ఆర్వో కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య	పోలింగ్ కేంద్రాలు
ఆదిలాబాద్	2,35,748	290
బోథ్	2,06,690	302
ఖానాపూర్	2,17,665	305
ఆసిఫాబాద్	2,24,661	304

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్(ఈసీ) నుంచి శుక్రవారం నోటిఫికేషన్ జారీ కానుండటంతో ఇప్పటికే సర్వం సిద్ధం చేశారు. రేపటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలుకానుంది. ఆయా నియోజకవర్గాల్లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ వారం పాటు ఇక నుంచి ఈ సందడే కనిపించనుంది.

రిటర్నింగ్ కార్యాలయాల్లో..

కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ పర్యవేక్షణలో జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టరేట్‌లోని తహసీల్దార్ కార్యాలయం, బోథ్‌లో తహసీల్దార్ కార్యాలయం పక్కన నూతన భవనంలో, ఉట్నూర్, ఆసిఫాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయాల్లో రిటర్నింగ్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇక్కడే నామినేషన్లను స్వీకరించనున్నారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ (ఈఆర్వో)లుగా ఆదిలాబాద్‌కు ఆర్డీవో స్రవంతి, బోథ్‌కు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్‌కు ఆర్డీవో ఎల్.జీవాకర్‌రెడ్డి, ఆసిఫాబాద్‌కు అదనపు కలెక్టర్ దాసరి వేణు వ్యవహరిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. సప్లిమెంటరీ లిస్టు నవంబర్ 10న రానుంది. ఇక ఈవీఎం, ఈవీ ప్యాడ్‌లకు సంబంధించి ఫస్ట్ లెవల్ ర్యాండమైజేషన్ పూర్తయింది. సెకండ్ లెవల్ జరగాల్సి ఉంది. పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు ఉండగా ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తక్షణం వాటిని మార్చేందుకు 20 శాతం అదనంగా వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఏపీవో)లకు శిక్షణ కార్యక్రమాలు రేపటితో ముగియనున్నాయి. పోలింగ్ ఏజెంట్లకు సంబంధించి ఆయా పార్టీల నుంచి జాబితాలు తీసుకోవడం జరిగింది. ఇలా ఎన్నికలకు సంబంధించి ఒక్కో ఘట్టం పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ఇదిలా ఉంటే మధ్యలో జిల్లాలో ఎలక్ట్రోల్ అబ్జర్వర్ అహ్మద్ నదీం పర్యటించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి సమీక్ష జరిపారు. ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ మంచిర్యాల జిల్లాలో పర్యటించారు. నాలుగు జిల్లాలకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించడం జరిగింది. ఇక జిల్లాలో బందోబస్తుకు సంబంధించి ఇప్పటికే కేంద్ర బలగాలు చేరుకున్నాయి. ఇటీవలే జిల్లా కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ బలగాలన్నీ పని చేయనున్నాయి.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన అవసరం

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఈ నెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తే ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండదన్నారు. పీవోలు, ఏపీవోలకు అందిస్తున్న హ్యాండ్‌బుక్, ఇతర సామగ్రిని పరిశీలించి శిక్షణ సిబ్బందికి అందించాలన్నారు. ఈసీ మార్గదర్శకాలు, నిబంధనలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. మాక్ పోలింగ్‌ను ఏజెంట్ల సమక్షంలో ఉదయం ఆరు గంటలకు చేపట్టాలన్నారు. తరువాత ఆ సమాచారాన్నంతా తప్పనిసరిగా క్లియర్ చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలను సరి చూసుకోవాలని సూచించారు. సీసీ నిఘాలో పోలింగ్ నిర్వహిస్తున్నందున ప్రతీ అంశం రికార్డు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

వామ్మో.. పులి!



- తాంసి(కె) శివారులో ఆవుల మందపై దాడి
- గాయపడిన రెండు దూడలు

తాంసి: పులి సంచారంతో పెన్‌గంగా పరీవాహక ప్రాంత గ్రామాల్లోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వారం క్రితం పిప్పల్‌కోటి శివారులో పులి దాడిలో ఒక ఆవు హతమైన విషయం విదితమే. ఆ ఘటన మరువక ముందే తాజాగా పులి తాంసి(కె) శివారులో పశువుల మందపై దాడి చేసింది. గ్రామానికి చెందిన కాపరి భూమన్న పశువులను బుధవారం గ్రాసం కోసం పంట చేల వైపు తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో పులి ఒక్కసారిగా మందపై దాడి చేసింది. అగ్గిమల మురళికి చెందిన రెండు దూడలు తీవ్రంగా గాయపడ్డాయి. కాపరి కేకలు వేయడంతో పులి అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. తాంసి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హైమద్, సిబ్బందితో అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి దాడి చేసి గాయపర్చినట్లుగా నిర్ధారించారు. పులి కదలికల కోసం సమీప ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులి సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. పంటచేలకు ఉదయం 9తరువాత వెళ్లాలని, సాయంత్రం 4గంటల లోపే ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. సిబ్బందితో బేస్‌క్యాంప్ ఏర్పాటు చేసి పులి కదలికలను పరిశీలిస్తున్నామన్నారు. వారి వెంట బీట్ అధికారి సాయికుమార్, ఎనిమల్ ట్రాకర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు. కాగా, పులి సంచారంతో సమీపంలోని గొల్లఘాట్, తాంసి(కె), పిప్పల్‌కోటి గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పులిదాడిలో గాయపడిన దూడ

నామినేషన్ ఘట్టానికి ఏర్పాట్లు

- రేపటి నుంచి ప్రక్రియ షురూ
- బోథ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్



చాహత్ బాజ్‌పాయ్

బోథ్: ఎన్నికల నేపథ్యంలో రేపటి నుంచి నామినేషన్ల పర్వం షురూ కానుంది. ఈమేరకు నియోజకవర్గ కేంద్రంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బోథ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. బుధవారం ఆమె 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

సాక్షి: నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లు పూర్తయ్యాయా?

ఆర్వో: ఈ నెల 3 నుంచి నామినేషన్లను స్వీకరిస్తాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బోథ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లను సమర్పించాలి. ఈ నెల 10వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

సాక్షి: నామినేషన్‌కు ఏమేం దాఖలు చేయాలి?

ఆర్వో: నామినేషన్‌కు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చేస్తేనే ఫాం–2 నామినేషన్ పత్రం ఇవ్వడం జరుగుతుంది. అలాగే నామినేషన్ దాఖలు చేసేవారు ఫాం–26 ద్వారా అఫిడవిట్ సమర్పించాలి. వారి ఆస్తులు, రాబడి, అప్పులు, కేసులను అందులో పేర్కొనాలి. అన్ని కాలమ్‌లను పూర్తి చేయాలి. ఖాళీలు ఉంటే అభ్యర్థికి తెలియజేస్తాం. గడువు ముగిస్తే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.

సాక్షి: అభ్యర్థుల తుది జాబితా ఎప్పుడు ప్రకటిస్తారు.?

ఆర్వో: ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తాం. 13న పరిశీలన ఉంటుంది. అదే రోజున అభ్యర్థుల జాబితా విడుదల చేస్తాం. 15వరకు ఉపసంహరణ గడువు ఉంటుంది. ఉపసంహరణ తరువాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తాం.

సాక్షి: నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, మిగతా వివరాలు..?

ఆర్వో: బోథ్ నియోజకవర్గంలో మొత్తం 302 పోలింగ్ కేంద్రాలున్నాయి. 422 వీవీప్యాట్‌లు, 377 ఈవీఎంలను సిద్ధంగా ఉంచాం. ఈ నెల 10వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల అవుతుంది. ఆ జాబితా ఆధారంగానే ఎన్నికల నిర్వహణ ఉంటుంది.

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి



బైక్‌ర్యాలీలో పాల్గొన్న సోయం, కార్యకర్తలు

- బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు

తలమడుగు: ఈ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుని వలే పని చేసి పార్టీని గెలిపించాలని బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎంపీ సోయం బాపూరావు అన్నారు. తలమడుగు మండలంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి దేవాపూర్ బరంపూర్, అర్లి, రుయ్యాడి, తలమడుగు, కొత్తూరు, సుంకిడి గ్రామాల మీదుగా బుధవారం బైక్ ర్యాలీ చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, లక్ష్మణ్, రాజుయాదవ్, దశరథ్, రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాంసి, భీంపూర్‌లో..

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల గుండా పార్టీ శ్రేణులతో కలిసి సోయం బాపూరావు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం భీంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జీవీ.రమణ, జ్యోతిరెడ్డి, ఆడే మానాజీ, సామ సంతోష్ రెడ్డి, రాకేశ్, సూర్యకాంత్, అశోక్, ఎంపీటీసీ పాండ్‌రంగ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

ఇచ్చోడ: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని సోయం బాపూరావు అన్నారు. బుధవారం మండలంలోని పట్వారిగూడ, మాదపూర్ గ్రామస్తులు పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి యువత ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం రూ. లక్షల కోట్లు దోచుకుందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో సోయం యువసేన జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.



'గుస్సాడీ'కి సిద్ధం..

గుస్సాడీ కోసం ఆదివాసీలు సన్నద్ధమవుతున్నారు. దీపావళి సందర్భంగా అడవిబిడ్డలు ప్రదర్శించే నృత్యంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది నెమలి ఈకలతో తయారు చేసే టోపీలే. ఇందులో భాగంగా మండలంలోని గేర్జం గ్రామంలో భీంరావు తయారు చేసిన గుస్సాడి టోపీని ఇంటి ఆవరణలో కర్రకు తగిలించి ఆరబెట్టాడిలా. – ఇచ్చోడ

కూరగాయలు అమ్ముతూ ప్రచారం చేస్తున్న ప్రేమేందర్



ఇస్త్రీ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న శంకర్



టీ తయారు చేస్తూ ప్రచారంలో 'సోయం' తనయుడు వెంకటేశ్



ప్రచారం.. వినూత్నం

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు, కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు తనయుడు వెంకటేశ్ తలమడుగు మండలం దేవాపూర్‌లో చాయ్ తయారు చేస్తూ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న తనయుడు మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్ కూరగాయలు అమ్ముతూ, బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ ఇస్త్రీ చేస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

మద్యం పట్టివేత



మద్యం పట్టుకున్న పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని హవ్‌గాం గ్రామ శివారులో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. హవ్గాం శివారు ప్రాంతంలో బరుకుంట భోజన్న అనే వ్యక్తి వద్ద పట్టుబడిన మద్యం బాటిళ్ల విలువ రూ.11500లకు ఉంటుందని వివరించారు. అక్రమంగా బెల్ట్ షాపును నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య

లోకేశ్వరం: మండలంలోని హవ్గాం గ్రామానికి చెందిన జాదవ్ మారుతి(52) బుధవారం పురుగుల తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... హవ్‌గాం గ్రామానికి చెందిన మారుతి కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆస్పత్రిలు తిరిగినా నయం కాక పోవడంతో తాగుడికి బానిసయ్యాడు. మంగళవారం కడుపు నొప్పి తీవ్రం కావడంతో బాధ భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. భార్య లలిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఫిట్స్‌తో చిన్నారి మృతి



ఆరాధ్య (ఫైల్)

బోథ్: మండల కేంద్రానికి చెందిన నరంశెట్టి ప్రకాష్, పల్లవి దంపతుల కూతురు ఆరాధ్య(ఎనిమిది నెలలు) ఫిట్స్‌తో మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చిన్నారి ఆరాధ్య మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. మంగళవారం రాత్రి ఫిట్స్ రావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించారు. కొంచెం నయం కావడంతో ఇంటికి తీసుకొచ్చారు. నిర్మల్‌లోని చిన్న పిల్లల వైద్యులకు చూపించేందుకు బుధవారం తీసుకువెళ్లారు. నిర్మల్ చేరుకోగానే మళ్లీ ఫిట్స్ వచ్చింది. వైద్యులకు చూపించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో బుధవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు.. కల్లూర్‌లోని కల్లుబట్టి వెనకాల ముగ్గురు పేకాటాడుతుండగా పట్టుకున్నామన్నారు. వీరివద్ద రూ.2,450 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రాష్ట్ర కోచ్‌గా జిల్లా వాసి

ఆదిలాబాద్: గోవా రాష్ట్రంలో నవంబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి రిథమిక్ యోగా పోటీలకు తెలంగాణ జట్టుకు సంబంధించి యోగా శిక్షకుడిగా కె.సంతోష్ నియామకమయ్యారు. సంతోష్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో శిక్షకుడిగా వ్యవహరిస్తున్నాడు. రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చౌహాన్ ప్రజ్యోత్, భార్గవ్‌లకు శిక్షకుడిగా ఉండనున్నారు. ఈ మేరకు బుధవారం క్రీడాకారులతో కలిసి గోవాకు బయలుదేరాడు.

తస్మాత్ జాగ్రత్త..

జంగ్ తెలంగాణ

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- అభ్యర్థుల ఆస్తులు, నేర చరిత్ర చెప్పాల్సిందే
- పొరపాటు చేస్తే పదవికే ఎసరు



బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

బెల్లంపల్లి/కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో తొలి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాన్ని సరిగా పూర్తిచేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)కు అప్పగించడం, విధి విధానాలను అనుసరించి వ్యవహరించడం, పలు అంశాలను తూచ తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఎన్నికల అఫిడవిట్‌లో తమ ఆస్తులు, నేర చరిత్ర, కులం వంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలి. ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా వారి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అఫిడవిట్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసి ఎన్నికల్లో విజయం సాధించినా ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది. అందుచేత నామినేషన్ పత్రాల్లో సరైన వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని, నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

ఆస్తుల వివరాలు అందించాల్సిందే...

ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో తమకున్న ఆస్తుల వివరాలను విధిగా నమోదు చేయాలి. స్థిర, చర ఆస్తులు, ఆభరణాలు, వాహనాల వివరాలు నిర్దిష్ట ప్రోఫార్మాలో నమోదు చేయాల్సి ఉంటుంది. వారికున్న రుణాలు, అప్పులు, ఐదేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలు సైతం అందించాలి.

కులం వివరాలు తప్పనిసరి

అభ్యర్థులు తమ కులం వివరాలను అఫిడవిట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈసీ ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారంగానే అభ్యర్థులు పోటీ చేయాల్సి ఉండడంతో ఆ కులం వివరాలతో పాటు రెవెన్యూ అధికారి జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది. జనరల్ స్థానాల్లో పోటీ చేసే వారికి ఈ నిబంధన వర్తించదు.

నామినేషన్ దాఖలు కోసం..

- ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతీ పౌరుడు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.
- పోటీచేసే అభ్యర్థి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయం నుంచి నామినేషన్‌పత్రం పొందాల్సి ఉంటుంది.
- నామినేషన్ పత్రాన్ని అభ్యర్థి క్షుణ్ణంగా చదివి అన్ని వివరాలు సంపూర్ణంగా నింపాలి.
- నామినేషన్ దాఖలు చేయడం కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు.
- నామినేషన్ దాఖలు చేయడానికి ఆర్వో కార్యాలయం వరకు వెళ్లడానికి అభ్యర్థికి సంబంధించి 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. వాటిలో అభ్యర్థితో సహా మరో నలుగురు మాత్రమే వెంట ఉండాల్సి ఉంటుంది. అంతకుమించి ఏ ఒక్కరినీ అదనంగా పంపించడానికి అనుమతించడం కుదరదు.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థి, అతని పార్టీ లేదా అనుచరులు వినియోగించే వాహనాలు ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో పార్కింగ్ చేయాలి.
- నామినేషన్ దాఖలు చేసే క్రమంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అభ్యర్థులు ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- పూర్తి చేసిన నామినేషన్ పత్రాన్ని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించాలి.
- ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో నామినేషన్ల స్వీకరణ జరగదు.
- ఒక అభ్యర్థి గరిష్టంగా 4 సెట్ల వరకు నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు.
- ఏదేని గుర్తింపు పొందిన రాజకీయపార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి అయితే ఆ నియోజకవర్గ పౌరుడు ప్రతిపాదించి సంతకం చేస్తే సరిపోతుంది.
- ఇండిపెండెంట్ అభ్యర్థి అయితే 10మంది పౌరులు ప్రతిపాదించి సంతకం చేయాలి.
- ప్రతిపాదించే పౌరుడు నిరక్షరాస్యుడైతే సదరు వ్యక్తి రిటర్నింగ్ అధికారి ముందు వేలిముద్ర వేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి రిజర్వేషన్ ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ అయితే రూ.5 వేలు, బీసీ, జనరల్ అభ్యర్థులైతే రూ.10 వేలు చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. నగదు లేదా ట్రెజరరీ చలానా ద్వారా డిపాజిట్ చేయవచ్చు.
- అభ్యర్థి గరిష్టంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు మించి ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేదు.

బ్యాంకు ఖాతా తప్పనిసరి

- ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తప్పనిసరిగా నామినేషన్ దాఖలుకు కనీసం ఒక రోజు ముందు ప్రభుత్వ రంగ బ్యాంకు నుంచి కొత్తగా ఖాతా తెరిచి ఉంచుకోవాలి.
- అభ్యర్థి నాన్ లోకల్ అయితే అతనికి ఎక్కడ ఓటు హక్కు ఉందో ఆ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సదరు అభ్యర్థికి ఓటు ఉన్నట్లు ధృవీకరించి అటెస్టెడ్ చేయాల్సి ఉంటుంది.
- నాన్ లోకల్ అభ్యర్థిని ప్రతిపాదించే పౌరుడు మాత్రం పోటీ చేస్తున్న నియోజకవర్గానికి చెందిన వాడై ఉండాలి.
- అభ్యర్థి నామినేషన్ పత్రంతో పాటు 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు అందజేయాలి. నల్లద్దాలు, కూలింగ్ అద్దాలు ధరించి దిగిన ఫొటోలు చెల్లుబాటు కావు.
- ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్‌పత్రంతో పాటు ఫామ్ 26 రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. నామినేషన్ దాఖలు చేసే రోజు ఫామ్ 26ను అందజేయకపోయినా ఆఖరు రోజు (10న) మధ్యాహ్నం 3 గంటలలోపు తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థిపై ఏదైనా పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్, ఇతర కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను తప్పనిసరిగా దినపత్రికల్లో ప్రముఖంగా ప్రకటించాలి.
- గుర్తింపు పొందిన రాజకీయపార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్ దాఖలు చివరి రోజు వరకు ఏ, బీ ఫామ్స్ అందించడం అనివార్యం.
- పోటీ చేస్తున్న అభ్యర్థి ఎలక్షన్ ఏజెంట్, అడిషనల్ ఎలక్షన్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు.

తప్పుడు సమాచారంతో ఇబ్బందులే

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈసీ నిబంధనల మేరకు నామినేషన్ పత్రాల అఫిడవిట్‌లో ఆస్తులు, కేసుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. ఈ వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రజల ముందు ఉంచుతుంది. కనుక తప్పుడు సమాచారం నమోదు చేస్తే భవిష్యత్‌లో న్యాయపరంగా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఎన్నికల అఫిడవిట్‌ను పూర్తిగా నమోదు చేయాలి. లేనిపక్షంలో తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించడం శ్రేయస్కరం.

– ఎస్.శ్రీనివాస్, ఏఈఆర్వో, ఆదిలాబాద్

ఎమ్మెల్యే టికెట్ తనకే ఇవ్వాలని విన్నపం



ప్రకాశ్ రాథోడ్‌కు వినతిపత్రం అందిస్తున్న చారులత రాథోడ్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇవ్వాలని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ పార్టీ జిల్లా పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్‌కి వినతిపత్రాన్ని బుధవారం అందించారు. వారు చారులత రాథోడ్ నివాసానికి రావడంతో విన్నవించారు. పార్టీ టికెట్ వెడ్మబొజ్జుకు ఇవ్వడం సరికాదని, ఖానాపూర్ నియోజకవర్గంలో ఆయన అనర్హుడని, నియోజకవర్గంలో లంబాడా జనాభా ఎక్కువగా ఉందని, పార్టీ టికెట్ లంబాడా సమాజంలోని మహిళా రిజర్వేషన్ ఆధారంగా తనకు కేటాయిస్తే గెలుపు సాధ్యమవుతుందని వారి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా పార్టీ అధినేతలు రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ, ఠాక్రేలకు సైతం విన్నపాన్ని ఫ్యాక్స్ చేసినట్లు వివరించారు. ఆమె వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మహేశ్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని బంధం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ డిపో నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. బైక్‌పై వస్తున్న బదావత్ మహేశ్(22) సంఘటన స్థలంలోనే మృతిచెందగా, రాజేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరు నిజామాబాద్ జిల్లా సిద్దాపూర్ గ్రామానికి చెందినవారు. నాలుగు సంవత్సరాలుగా మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. పని నిమిత్తం కొర్టికల్ గ్రామం వైపు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని, చికిత్స కోసం రాజేందర్‌ను నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యం షాపుల్లో ఆకస్మిక తనిఖీ



కనకాపూర్‌లో వైన్‌షాప్‌లో పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మద్యం షాపులో ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నియామవళి అమలు ఉండడంతో బుధవారం రాత్రి 8గంటల సమయంలో మండలానికి సహస్ర వైన్స్, ద్వారకా తిరుమల వెంకటేశ్వర వైన్స్, అర్కే వైన్స్‌లను ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రవి కుమార్ మాట్లాడుతూ ఇతర షాపులకు చెందిన మద్యం ఉండరాదని, సమయపాలన పాటించాలని, కల్తీ మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో ఎస్సైలు రవి కుమార్, రమేష్, కానిస్టేబుల్ కల్పన పాల్గొన్నారు.

నిజాయతీ చాటిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్



బాధితుడికి నగదు అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఖానాపూర్: నిర్మల్ నుంచి ఖానాపూర్ పట్టణానికి వచ్చిన రాజేష్ అనే యువకుడు బస్సులో పోగొట్టుకున్న రూ.20వేలను డ్రైవర్ దశరథ్, కండక్టర్ గంగాధర్ గుర్తించి బుధవారం బాధితుడికి తిరిగి అప్పగించారు. పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద దిగిపోయిన యువకుడి వివరాలను తెలుసుకుని స్థానిక బస్టాండ్‌లో కంట్రోలర్ మోయినొద్దీన్ సమక్షంలో అందజేసి నిజాయితీ చాటుకున్నారు. ఆర్టీసీ సిబ్బందిని పలువురు అభినందించారు.

ఢిల్లీకి చేరిన అమృత కలశాలు



మంత్రి కిషన్‌రెడ్డితో యువకులు

బోథ్: జిల్లా నుంచి సేకరించిన మట్టితో కూడిన అమృత కలశాలు ఢిల్లీకి చేరాయి. అమరవీరుల స్మృతివనం కట్టడంలో భాగంగా అమృత కలశాలను యువకులు ఢిల్లీకి తీసుకెళ్లారు. బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్‌తో పాటు పలువురు యువకులు ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు.

రైలులో గంజాయి పట్టివేత

భైంసా: నాందేడ్–విశాఖపట్నం రైలులో తరలిస్తున్న ఎనిమిది కిలోల గంజాయిని బాసర రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. విశాఖ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న రైలులో బుధవారం రైల్వే పోలీసులతో పాటు నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారులు స్పెషల్ డ్రైవర్‌లో భాగంగా రూ.2లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జనరల్ బోగిలో గంజాయిగా గుర్తించారు. పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన నలుగురిపై కేసు

ఎదులాపురం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన నలుగురిపై వన్ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా మంగళవారం రాత్రి 10:30 గంటల తర్వాత షాపులను తెరిచి ఉంచిన పట్టణంలోని నలుగురు పాన్‌షాప్ నిర్వాహకులు అబ్దుల్ రెహమాన్ (నేతాజీచౌక్), సర్ఫరాజ్ అలీ (ఆర్టీసీ బస్టాండ్ ఎదుట), ఓట్కార్ గోపి (ద్వారకానగర్), కోటవార్ స్వప్నిల్ (ఆర్టీసీ బస్టాండ్ ఎదుట)లపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. రాత్రి 10.30 గంటల తర్వాత ఎవరైనా షాపులు తెరిచి ఉంచితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

షాప్ యాజమానిపై కేసు..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలోని కరాచీ బేకరి యాజమాని రేహాన్ పాషా ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాత్రి 10 గంటల కంటే ముందుగానే దుకాణాలు మూసివేయాలని, కరాచీ బేకరి యజమాని మంగళవారం రాత్రి 10 గంటలైనప్పటికీ దుకాణం మూసి వేయకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుడు

ఆదిలాబాద్: ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు గోవా రాష్ట్రంలో నిర్వహించే 37వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఇంద్రవెల్లి మండలం బర్సన్‌పటార్ కొలాంగూడ గ్రామం నుంచి మడావి ప్రశాంత్ ఎంపికయ్యాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి తెలంగాణ ఖోఖో జట్టుకు ప్రశాంత్ ఒక్కడే ప్రాతినిధ్యం వహిస్తూ ఉండడం విశేషం.

తప్పిన పెను ప్రమాదం



వంతెన గోడపై ఆగిన ఆటో



గాయపడిన ఆటో డ్రైవర్ రాంకిషన్ ముండే



ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు

- ఆటోను ఢీకొన్న లారీ
- పలువురికి గాయాలు

గుడిహత్నూర్: మండలంలో జాతీయ రహదారి 44పై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలంలోని మెండపల్లికి చెందిన రాంకిషన్ ముండే ఆటోలో నలుగురు చిన్నారులు, మరో ఆరుగురు ప్రయాణికులను తీసుకొని గుడిహత్నూర్ నుండి మెండపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుడిహత్నూర్ వాగుపై ఉన్న బ్రిడ్జి వద్దకు చేరగానే వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో ఆటో వంతెన గోడపై వాలింది. ఈ క్రమంలో ఆటో ముందు అద్దం పగిలి డ్రైవర్ రాంకిషన్ వాగులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన ప్రయాణికుల్లో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మిగిత వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని వెంటనే హైవే అంబులెన్సు, 108, పోలీసు వాహనంలో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

బీజేపీ బైక్ ర్యాలీలో అపశృతి

- బైక్ అదుపుతప్పి కార్యకర్తకు తీవ్ర గాయాలు



వివరాలు తెలుసుకుంటున్న సోయం బాపూరావు

తాంసి: బీజేపీ బోథ్ అభ్యర్థి సోయం బాపురావుకు మద్దతుగా బుధవారం బీజేపీ శ్రేణులు చేపట్టిన బైక్ ర్యాలీలో అపశృతి చోటు చేసుకుంది. తలమడుగు మండలంలోని దేవాపూర్ నుంచి ఆయా గ్రామాల గుండా భీంపూర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో పాల్గొన్న భీంపూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కుమ్రం రమేశ్ జామిడి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. రమేశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రమేష్‌ను నాయకులు హుటాహుటినా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. సాయంత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తను ఎంపీ, బీజేపీ బోథ్ అభ్యర్థి సోయం బాపురావు నాయకులతో కలిసి పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని ఆదేశించారు.

సీఎం వస్తున్నా.. చీకట్లే



కలెక్టరేట్‌కు వెళ్లేదారిలో వెలగని సెంట్రల్ లైటింగ్



ప్రారంభిస్తున్న మంత్రి (ఫైల్)

నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఇప్పటి వరకు వెలుగులు విరజిమ్మడం లేదు. గురువారం ఈ ప్రాంతంలోనే సీఎం కేసీఆర్ సభ సైతం ఉంది. జూన్ మూడో తేదీన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించగా నేటికి ఐదునెలల గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు వెలుగులు కనిపించడం లేదు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ప్రధాన రహదారిపై వాహనదారులు, మంత్రి స్వగ్రామమైన ఎల్లపల్లివాసులు, కొత్తగా ఏర్పడిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లేవారు చీకట్లోనే వెళ్లాల్సిన పరిస్థితి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

వినూత్న ప్రచారం..



ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమదైన శైలీలో వినూత్న ప్రచారం చేస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో అధికార పార్టీకి చెందిన కార్యకర్త స్కూటీపై సౌండ్ బాక్స్‌ను ఏర్పాటు చేసుకుని పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేస్తుండడం అందరినీ ఆలోచింపజేస్తుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్